అనుమతులు లేకుండా విక్రయిస్తే చర్యలు

పెడన: దీపావళి సందర్భంగా ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పెడన సీఐ షేక్ హబీబ్‌బాషా హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం పెడన పట్టణంలోని పలు దుకాణాలను పెడన ఎస్ఐ రవిచంద్రకుమార్, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ దీపావళిని పురస్కరించుకొని బాణసంచాను అనుమతి లేకుండా నిల్వ ఉంచినా, విక్రయాలు చేసినా, తయారు చేసినా చట్టం ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాణసంచా అక్రమ నిల్వలు, అనుమతులు లేని విక్రయాలపై సమాచారం తెలిస్తే వెంటనే సమీప పోలీసు వారికి తెలియజేయాలని ఆయన కోరారు.

అప్రమత్తత ముఖ్యం..

కృత్తివెన్ను: బాణసంచా తయారీ సమయంలో అప్రమత్తంగా ఉండాలని కృత్తివెన్ను తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఎస్ఐ గణేష్‌కుమార్ అన్నారు. చినగొల్లపాలెంలో బాణసంచా తయారీ లఘు పరిశ్రమను వారు పరిశీలించారు. నిబంధనల మేరకు పని చేస్తున్నారా, దానికి అవసరమైన అన్ని వసతులు కల్పించారా లేదా అనే అంశాలను వారు పరిశీలించారు. బాణసంచా తయారీతో పాటు విక్రయాలు జరిపే ప్రదేశంలోనూ నిబంధనలు పాటించాలని సూచించారు. బాణసంచా విక్రయాలకు కృత్తివెన్ను సీతనపల్లి స్లోపువద్ద, లక్ష్మీపురం లాకుల వద్ద స్థలాలను కేటాయించామని చెప్పారు.

టపాసుల షాపులకు స్థల పరిశీలన

మోపిదేవి: దీపావళి పర్వదినం సందర్భంగా టపాసుల షాపులకు స్థలం పరిశీస్తున్నామని తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ తెలిపారు. మోపిదేవి జెడ్పీ పాఠశాల ఆవరణలో టపాసుల షాపుల కోసం స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దీపావళి సందర్భంగా ఈ నెల 11, 12 తేదీల్లో ఏర్పాటుచేసే టపాసుల షాపుల కోసం రెండు దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. దరఖాస్తులు, స్థలం పరిశీలించి షాపులకు కేటాయిస్తామన్నారు. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



కోడూరు దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎస్ఐ రాజేంద్రప్రసాద్

దుకాణాల్లో పోలీసుల తనిఖీలు

కోడూరు: బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, బాణసంచాను దుకాణాల్లో నిల్వ చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పలు దుకాణాల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దీపావళి టపాసుల విక్రయాలకు పండుగ రోజు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతిస్తోందన్నారు. ఈ స్టాల్స్‌లో టపాసులను బయట దుకాణాల్లో విక్రయించడం చట్టరీత్యా నేరమని చెప్పారు. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖల నుంచి అనుమతులు తీసుకున్న తరువాత మాత్రమే స్టాల్స్ ఏర్పాటుకు నంబర్ కేటాయిస్తారని, స్టాల్స్ ఏర్పాటు చేయాలనుకొనేవారు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఏఎస్ఐ వీరాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

● చల్లపల్లి: దీపావళి బాణసంచా విక్రయాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని చల్లపల్లి సీఐ సీహెచ్ నాగ ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక బాణసంచా దుకాణాన్ని రెవెన్యూ, పోలీస్, అగ్ని మాపక శాఖల అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనుమతుల రెన్యూవల్స్, అగ్నిమాపక పరికరాల ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం దీపావళి స్టాల్స్ ఏర్పాటుకు స్థలం పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.గోపాలకృష్ణ, ఎస్ఐలు సీహెచ్ చినబాబు, కుడిపూడి శ్రీనివాసు, అగ్నిమాపక శాఖాధికారి సీహెచ్‌వీవీ ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ విమలకుమారి

16 దరఖాస్తులు

నాగాయలంక: బాణసంచా విక్రయదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ జె.విమలకుమారి అన్నారు. ఈనెల 12వ తేదీన దీపావళి పండుగను పురస్కరించుకుని మండలంలో బాణసంచా విక్రయదారులు, పోలీస్, అగ్నిమాపక శాఖాధికారులతో మండల రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దుకాణాల ఏర్పాటుకు తాత్కాలిక లైసెన్సుల నిమిత్తం 16 దరఖాస్తులు అందాయని చెప్పారు. అనంతరం వారితో కలిసి ఆమె స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ ఆవరణలో బాణసంచా దుకాణాల కేటాయింపు గ్రౌండ్‌ను పరిశీలించి నిబంధనల మేరకు లే అవుట్ నిర్దేశించారు. నాగాయలంక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం, అవనిగడ్డ అగ్నిమాపక శాఖాధికారి పీఎస్‌వీవీ ప్రసాద్, వీర్వోలు, కార్యాలయ సిబ్బంది, బాణసంచా వ్యాపారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మత్స్యకార భవనానికి ఎంపీ నిధులు మంజూరు



నడకుదురు(చల్లపల్లి): చల్లపల్లి మండలం నడకుదురు శివారు పాత నడకుదురు గ్రామంలో మత్స్యకార భవనం నిర్మాణానికి మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి రూ.15 లక్షలు మంజూరు చేశారు. సర్పంచ్ గొరిపర్తి సురేష్‌బాబు చొరవతో ఎంపీ ఈ మేరకు నిధులు మంజూరు చేయగా మంగళవారం మచిలీపట్నంలో ఎంపీని సర్పంచ్ సురేష్, మత్స్యకార సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు వడుగు రామచంద్రరావు, పీతా చిరంజీవి కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు వేమూరి గోవర్ధనరావు, దాసరి హరిబాబు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత

మచిలీపట్నంటౌన్: బాలల సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. శిశు రక్షణ దినోత్సవాన్ని మంగళవారం స్థానిక నర్సింగ్ కళాశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథి రామకృష్ణయ్య మాట్లాడుతూ పిల్లలను సంరక్షించి ప్రయోజకులను చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఏ పౌరుడు ఆర్థిక కారణాలు, ఇతర కారణాలతో బలహీనతలతో న్యాయాన్ని పొందే అవకాశం కోల్పోకూడదనే ఉద్దేశంతో ఉచిత వైద్యం, విద్యతో పాటు న్యాయపరమైన సలహాలు ప్రజలకు ఇస్తున్నామని తెలిపారు. తొలుత ఆస్పత్రి ఆవరణలో నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. సర్వజన ఆస్పత్రి పిల్లల విభాగాధిపతి గౌరి, ఆస్పత్రి డెప్యూటీ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రోజారమణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వరలక్ష్మి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి మునలయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

కృత్తివెన్ను: మండల పరిధిలోని పెన్నమ్మదిబ్బ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బి. త్రిపురసుందరీదేవి మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న విద్యా బోధన తదితర అంశాలపై ఉపాధ్యాయుల నుంచి సమాచారం తీసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులకు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని రుచిగా, శుచిగా వండి వడ్డించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎస్ఏఎం. దేవి, సీఆర్పీ సోమశేఖర్, డీటీఈఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పోలవరం క్రీడాకారుల ప్రతిభ

గూడూరు: ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గూడూరు మండలం పోలవరం క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల 5న విజయవాడలో జరిగిన సబ్ జూనియర్ విభాగం వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పోలవరానికి చెందిన బూసం విజయ్ ప్రథమ బహుమతి సాధించగా, గుత్తి సాయి, పిచ్చుక హర్షలు తృతీయ బహుమతులు సాధించారు. సీనియర్స్ విభాగంలో మువ్వల నాగరాజు ప్రథమ బహుమతి సాధించాడు. జిల్లా స్థాయిలో పతకాలు సాధించి గ్రామానికి గుర్తింపు తీసుకువచ్చిన క్రీడాకారులను గూడూరు వైస్ ఎంపీపీ పిచ్చుక గంగాధరరావు, సర్పంచి నక్కిన వెంకట నాగరాజు, నాయకుడు గిరిజా మోహనరావు అభినందించారు.

సత్తా చాటిన గురుకుల విద్యార్థినులు

పెడన: ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -19 ఇంటర్ డిస్ట్రిక్స్ వాలీబాల్ టోర్నమెంట్‌లో పెడన మండలం బల్లిపర్రు గురుకుల పాఠశాల విద్యార్థినులు ఇద్దరు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ ఎస్. రూతమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్ తిరుపతిలో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు జరిగిందన్నారు. కృష్ణాజిల్లాలో బల్లిపర్రు గురుకులానికి చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పీఎస్‌వీటీ ప్రియ, కె. అనూషలకు చోటు దక్కిందని, కృష్ణా జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుందని చెప్పారు. విద్యార్థినులను, శిక్షణ ఇచ్చిన పీఈటీ మాధవి, ప్రశాంతిని అభినందించారు.

వ్యవసాయాన్ని పండుగ చేసిన జగన్

● మంత్రి జోగి రమేష్
● పెడన నియోజకవర్గంలో 27,196 మంది రైతులకు లబ్ధి



పెడన: వ్యవసాయం దండగ అని చంద్రబాబు హేళన చేయగా.. అదే వ్యవసాయాన్ని వివిధ పథకాలు అమలుచేసి రైతులకు అండగా నిలిచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పండుగలా మార్చారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. రైతు భరోసా నిధుల విడుదలపై మంత్రి జోగి రమేష్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వరుసగా ఐదో ఏడాది దేశంలో ఎక్కడా లేనివిధంగా సొంత భూమి సాగు చేసుకుంటున్న రైతులతో పాటు కౌలు రైతులకు, అటవీ, దేవదాయ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు కూడా వైఎస్సార్ రైతు భరోసా కింద ప్రతి సంవత్సరం రూ.13,500 మూడు విడతలుగా ఆర్థిక సహాయం అందిస్తున్నారన్నారు. ఈ ఏడాదిలో రెండో విడతగా రూ.4 వేలు అందిస్తున్న సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంత్రి జోగి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

మండలాల వారీగా ఇలా..

బంటుమిల్లి మండలంలోని 5,326 మంది రైతులకు రూ.2,22,54,500, గూడూరు మండలంలో 8,739 మంది రైతులకు రూ.3,69,06,000, కృత్తివెన్ను మండలంలో 3,246 మంది రైతులకు రూ.1,37,96,500, పెడన మండలంలో 9,886 మంది రైతులకు రూ.4,11,55,000 నిధులు వారి ఖాతాల్లో జమ అవుతాయని చెప్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా 27,197 మంది రైతులకు రూ.11,41,12,000 నగదు జమ చేశామని వివరించారు. ఈ విడతలో రూ.4 వేల చొప్పున 27,197 మంది రైతులకు రూ.10,87,88,000 వచ్చాయని, ఇటీవల ఎన్‌రోల్ అయి, రైతు భరోసా పెండింగ్‌లో ఉండి క్లియర్ అయిన వారికి కూడా రూ.53,24,000 ప్రభుత్వం అందజేస్తోందని తెలిపారు.

విద్యార్థినికి పాముకాటు



వెంకటాపురం(మోపిదేవి): మండల పరిధిలోని వెంకటాపురం లే అవుట్‌లో నివాసం ఉంటున్న కొండపల్లి నాగబాబు, శివసాయి కుమార్తె నిహారిక మంగళవారం పాముకాటుకు గురైంది. ఆమెను తల్లిదండ్రులు చల్లపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విద్యార్థిని ఏడో తరగతి చదువుతోంది. వైద్యుల పర్యవేక్షణలో ఉంది. విషయం తెలుసుకున్న అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆస్పత్రికి వెళ్లి బాధితురాలిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఎన్‌టీఆర్ కాలనీలో మెరక లేకపోవడం వల్ల ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలకు కాలనీలో నీళ్లు నిలిచి అందులో ప్రయాణిస్తున్న తమ కుమార్తెను పాము కాటేసిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేశారు. టీడీపీ నాయకులు మెరక పనులు అడ్డుకోవడం వల్లనే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు.

నూతన సౌకర్యాలకు ఆమోదం

చల్లపల్లి: విద్యార్థినిని పరామర్శించిన అనంతరం ఎమ్మెల్యే ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఆస్పత్రిలో అదనపు సౌకర్యాలు కల్పించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జ్ఞానరత్న ఎమ్మెల్యేను కోరారు. నూతన ప్రతిపాదనలపై చర్చించి ఎమ్మెల్యే ఆమోదించారు. సమావేశంలో సీహెచ్‌సీ డైరెక్టర్ అబ్దుల్ కరీం, వైద్యులు పాల్గొన్నారు.

మార్పులు, చేర్పులకు అవకాశం

● జాబితాల్లో తప్పులుంటే లిఖితపూర్వకంగా తెలియజేయండి
● బీఎల్‌ఓలతో సరిచేయిస్తాం
● పార్టీల నాయకులతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజ్యలక్ష్మి



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ రాజ్యలక్ష్మి

పెడన: ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తప్పులను సరిచేసుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు అవకాశం కల్పించాయని పెడన నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె. రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం పెడన తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితాలపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. పలువురు రాజకీయ నాయకులు మాట్లాడుతూ ఓటరు జాబితాల్లో తప్పులున్నాయని, వాటిని బీఎల్‌ఓలు సరిచేయడం లేదని చెప్పారు. దీనిపై స్పందించిన ఆమె ఎక్కడెక్కడ ఎటువంటి తప్పులున్నాయో లిఖితపూర్వకంగా తెలియజేస్తే వాటిని బీఎల్‌ఓలకు చెప్పి సరిచేయిస్తామన్నారు. ఒక కుటుంబంలోని వారంతా ఒకే సీరియల్ నంబర్లలో కాకుండా వేర్వేరు సీరియల్ నంబర్లలో ఉంటున్నారని, అలాగే ఒకే కుటుంబంలోని ఓటర్లు వేర్వేరు బూత్‌లలో ఓటరుగా ఉన్నారని ఈఆర్వో దృష్టికి తీసుకువచ్చారు. అలాంటివి ఏమైనా ఉంటే అవి ఏ బూత్, ఏ ప్రాంతం, ఓటరు పేరు లిఖిత పూర్వకంగా తెలియజేస్తే తప్పకుండా సరిచేయిస్తామని చెప్పారు. మృతుల విషయంలో కూడా సదరు కుటుంబ సభ్యులు లిఖిత పూర్వకంగా సమాచారం ఇస్తే పంచనామా నిర్వహించి, సాక్షులతో సంతకాలు తీసుకున్న తరువాత మాత్రమే వాటిని తొలగిస్తామన్నారు. ఓటరు జాబితాలను పార్టీ నాయకులకు కూడా అందజేశామని, వాటిల్లో తప్పులు ఏమైనా ఉంటే ఒక కాగితంపై రాసి నాకు లేదా తహసీల్దార్లకు అందజేయాలని సూచించారు. కొత్తగా ఓటరు నమోదు విషయంలో ఎటువంటి పొరపాట్లకు తావు ఉండదని, ఆధారాలు పెట్టి నమోదు చేస్తారని తెలిపారు. తొలగింపుల్లో మాత్రం ఒకటికి రెండు సార్లు పరిశీలించి, అందుకు తగ్గ ఆధారాలు కుటుంబ సభ్యులు విల్లింగ్ ఇచ్చారా లేదా పరిశీలన చేసిన తరువాతే తొలగిస్తారని చెప్పారు. తహసీల్దార్ పి. మధుసూదనరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బండారు మల్లి, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, ఎన్నికల విభాగం డెప్యూటీ తహసీల్దార్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

కోనేరుసెంటర్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. నెలకుర్రు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులతో నూతనంగా నిర్మించనున్న సిమెంట్ రోడ్డు పనులకు మంగళవారం కిట్టు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తోందన్నారు. గ్రామాల్లో సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లగా పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చొరవ చూపుతోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి ప్రజలు ఊహించిన వాటి కంటే ఎక్కువ నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వాణిజ్య పంటల సాగుపై శిక్షణ

కొక్కిలిగడ్డ(మోపిదేవి): ఉద్యాన శాఖ ద్వారా అందించే పలు రకాల వాణిజ్య పంటలపై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఉద్యాన అధికారి ఎస్. రమేష్ అన్నారు. మండల పరిధిలోని కొక్కిలిగడ్డలో సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు అధ్యక్షతన కూరగాయల తోటలు, బొప్పాయి, అరటి పండించే రైతులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ టమోటా పండించే రైతులకు సబ్సిడీపై ప్లాస్టిక్ ట్రేలు అందిస్తున్నామని చెప్పారు. ఒక హెక్టారుకు రూ. 20 వేలు రాయితీ ద్వారా పొందవచ్చునని, సబ్సిడీకి ఎఫ్‌ఐజీ గ్రూపు కింద రైతులు పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. బొప్పాయి, టమోటా పంటలు వేసే రైతులు వాటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, బిల్లులను రైతు భరోసా కేంద్రంలో గ్రామ ఉద్యాన సహాయకులకు అందజేయాలన్నారు. గ్రామ ఉద్యాన సహాయకులు, వలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలి

అవనిగడ్డ: ఉద్యానవన సాగులో ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యాన శాఖాధికారి ఎన్. రమేష్ అన్నారు. తొమ్మిదో వార్డులోని రైతు భరోసా కేంద్రంలో రైతు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ కొబ్బరి, జామ, అరటి, బొప్పాయి తోటల సాగులో ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను రైతులకు వివరించారు.

సాయం అందజేత

కొత్తమాజేరు(చల్లపల్లి): కొత్తమాజేరు గ్రామానికి చెందిన పీఏసీఎస్ సభ్యుడు కాగిత వెంకటేశ్వరరావు (85) ఇటీవల మృతి చెందాడు. సంఘ సభ్యుల సంక్షేమ నిధి నుంచి మంగళవారం రూ.10 వేలను మృతుని కుమారులకు సొసైటీ చైర్మన్ అరజా శివశంకర్ అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ ఎస్ఎస్ చక్రపాణి, పర్సన్లు మోతుకూరి నాగమల్లేశ్వరరావు, పల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెడన: కుమార్తెను కళాశాల బస్సును ఎక్కించాలనే తొందరలో స్కూటర్‌ను వేగంగా నడిపాడు తండ్రి. కళాశాల బస్సు స్పీడ్‌బ్రేకర్ ఎక్కి ప్రమాదవశాత్తు వెనక్కు రావడంతో స్కూటర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రీ, కుమార్తెలకు గాయాలయ్యాయి. పెడన పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం ఏడున్నర గంటల సమయంలో రైలు గేటు పడుతుందని తెలిసి హడావుడిగా రైలు గేట్ దాటే క్రమంలో గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల బస్సు వెనుకగా స్కూటీపై వస్తున్న కొలగాని శ్రీనివాస్ (48), ఆయన కుమార్తె నవ్య (20) వాహనాన్ని ఢీ కొట్టింది. స్పీడ్‌బ్రేకర్ ఎక్కే క్రమంలో ఒక్కసారిగా బస్సు వెనక్కు రావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. నవ్య కుడికాలు పాదం నలిగింది. శ్రీనివాస్ కింద పడటంతో రోడ్డు దెబ్బలు తగిలాయి. బాధితులను మచిలీపట్నం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

రేపటి నుంచి 'ఆంధ్రకు జగనే ఎందుకు కావాలి'

పెడన: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం గురువారం నుంచి జరుగుతుందని, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం కృష్ణా జిల్లా అధ్యక్షుడు గొరిపర్తి రవికుమార్ అన్నారు. పెడన వ్యవసాయ మార్కెట్ యార్డు మీటింగ్ హాల్లో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంపై పట్టణ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు పట్టణ కన్వీనర్ బండారు మల్లి అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ కార్యక్రమాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పెడన ఒకటో సచివాలయంలో గురువారం లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ శ్రేణులు విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. పట్టణ కన్వీనర్ బండారు మల్లి మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి నాలుగున్నరేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ఆయా కుటుంబాలకు వివరించి పార్టీకి మద్దతు కోరాలని సూచించారు. సమావేశంలో పెడన సచివాలయాల కన్వీనర్ మతీన్‌ఖాన్, మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్‌లీడర్ బళ్ల గంగయ్య, యువజన విభాగం పట్టణ నాయకుడు కటకం నాగకుమార్, కౌన్సిలర్లు పిచ్చిక సతీష్, మెట్ల సుబ్రహ్మణ్యం, వీరంకి నరసింహారావు, నాయకులు అబ్దుల్ ఖాదర్ జిలాని, వన్నంరెడ్డి మహంకాళరావు, కోమట్ల అనిల్, ఉమ్మిటి శ్రీను, రాజశేఖర్, మాధవరావు, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

సిల్ట్ తొలగింపు

కోడూరు: కోడూరు పంచాయతీ ఆధ్వర్యంలో టీడీపీ కల్యాణ మండపం, ఇండోర్ స్టేడియం, తూర్పు వైపు ఉన్న డ్రెయిన్లలో పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలతో పాటు సిల్ట్‌ను పంచాయతీ కార్మికులు తొలగించారు. బ్లీచింగ్ చల్లి పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. సర్పంచి వెన్నా షైనీ పర్యవేక్షించారు.

ప్రకటన

[illegible]

హెడ్ వాటర్ వర్క్స్ పరిశీలన



మచిలీపట్నంటౌన్: మెప్మా ఆధ్వర్యంలో వాటర్ ఫర్ ఉమెన్ - ఉమెన్ ఫర్ వాటర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలోని హెడ్ వాటర్ వర్క్స్‌ను డ్వాక్రా మహిళలు పరిశీలించారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి సుమారు 150 మంది డ్వాక్రా మహిళలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం హెడ్ వాటర్ వర్క్స్‌లో రా వాటర్‌ను శుద్ధి చేసే విధానంతో పాటు నగర ప్రజలకు తాగునీటి సరఫరా ఏఏ దశల్లో చేస్తున్నదీ పరిశీలించారు. తాగునీటి శుద్ధి, సరఫరా వంటి విషయాలను ఏఈ సాయిప్రసాద్ వీరికి వివరించారు. ఎంఈ శ్రీకాంత్, మెప్మా సిబ్బంది బసవేశ్వరరావు, విజయ, ఆర్పీలు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పెడన: పట్టణంలోని బ్రహ్మపురం దుకాణంలో ఓ మహిళ మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో పెడన పోలీసులు దాడి చేశారు. మంగళవారం జరిపిన దాడుల్లో జోగి రాఘవమ్మ దుకాణంలో ఆరు క్వార్టరు బాటిళ్లు లభ్యం కావడంతో ఆమెను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

బత్తిన నవలపై సమీక్ష

మచిలీపట్నంటౌన్: వృత్తి రీత్యా పెయింటర్ అయిన బత్తిన అగస్త్యేశ్వరరావు రాసిన నవల ప్రత్యేకంగా ఉందని పలువురు వక్తలు అన్నారు. అగస్త్యేశ్వరరావు రాసిన జగదేకవీరుడు-అతిలోక సుందరి పార్ట్-2 సినిమా నవల సమీక్ష కార్యక్రమం మంగళవారం స్థానిక మహతి ఆడిటోరియంలో జరిగింది. పుస్తకాన్ని రిటైర్డ్ అధ్యాపకుడు వెంకటేశ్వరరావు విశ్లేషించారు. నవలలో ఇతివృత్తం, పాత్రలు, సన్నివేశాలను చేయి తిరిగిన రచయితలా రాశారన్నారు. అనుభవం కలిగిన స్క్రీన్‌ప్లే రైటర్‌గా, పంచ్ డైలాగ్స్‌తో, సున్నిత హాస్యంతో, శృంగార గీతాలతో ఉందని వివరించారు. వైద్యుడు ధన్వంతరీఆచార్య, కృష్ణాజిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, ఆర్టీసీ డిపో మేనేజర్ టి. పెద్దిరాజు, న్యాయవాది బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

యాచకుడి మృతి



కోనేరుసెంటర్: మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ యాచకుడు మంగళవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా మాచర్ల గ్రామానికి చెందిన నక్షత్రపు వెంకటేశ్వరరావు (60) మచిలీపట్నం రాజుపేట ప్రాంతంలో కొన్ని రోజులుగా యాచిస్తూ తిరుగుతున్నాడు. పది రోజుల కిందట అనారోగ్యంతో బాధపడుతుండటంతో చికిత్స నిమిత్తం చుట్టుపక్కల వ్యాపారులు మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం మృతి చెందాడు. మృతుని తరఫు బంధువులు ఎవరైనా ఉంటే సెల్: 83329 83788, 94407 96414, 94407 96412 నంబర్లను సంప్రదించాలని సీఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

రూ. 5.24 లక్షల జరిమానా

మోపిదేవి: విద్యుత్ విజిలెన్స్ అధికారులు మండలంలో వినియోగదారులు గృహాలు, వాణిజ్య సముదాయాలపై మంగళవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అదనపు లోడు విద్యుత్ వినియోగదారులు 217 మందిపై వివిధ కేసులు నమోదు చేసి రూ. 5,24,000 జరిమానా విధించామని విజిలెన్స్ ఎస్ఈ ఎం. అల్ఫాన్స్ తెలిపారు. 37 బృందాలుగా ఏర్పడి 1,818 గృహ సర్వీసులు, 57 వాణిజ్య సముదాయాలను తనిఖీ చేశామని తెలిపారు. వాటిలో 211 సర్వీసులు అదనపు లోడు వినియోగానికిగాను మొత్తం రూ. 5,12,000 జరిమానా విధించామన్నారు. అనుమతించిన కేటగిరీ కాకుండా వేరే కేటగిరీ వాడుతున్న ఆరుగురు వినియోగదారులకు రూ. 12 వేలు జరిమానా విధించామని చెప్పారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగితే సెల్: 83310 14951, 94408 12363 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. తనిఖీల్లో విజిలెన్స్ ఈఈ కె. వెంకటేశ్వర్లు, ఉయ్యూరు ఈఈ డి. కృష్ణానాయక్, మండల ఏఈ ఎం. పాండురంగారావు, ఉయ్యూరు డివిజన్ పరిధిలోని ఏఈలు, జేఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.